క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 9న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. హనుమకొండ చౌరస్తా, కాకాజీకాలనీ, హనుమకొండ జిల్లా బస్‌స్టేషన్ రోడ్డు, అలంకార్ కూడలి, గాంధీనగర్, టైలర్ స్ట్రీట్ ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు.

టీపీసీసీ అధ్యక్షుడికి శుభాకాంక్షలు



హసన్‌పర్తి: టీపీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన మహేష్‌కుమార్ గౌడ్‌ను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు శనివారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పింగిలి వెంకట్రామ్ నర్సింహారెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి శేఖర్‌రావు, మాజీ సర్పంచ్ మదన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మహేష్‌కుమార్ నియామకంపై హర్షం

మడికొండ: తెలంగాణ రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడిగా బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్‌ను నియమించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు మడికొండ గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో గౌడ సంఘం నాయకులు మడికొండ చౌరస్తాలో ఆదివారం సంబురాలు జరుపుకున్నారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. గౌడ సంఘం సభ్యుడు బుర్ర రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు మాచర్ల రాజు, కాంగ్రెస్ నాయకులు బైరి లింగమూర్తిగౌడ్, కొత్తకొండ వెంకన్నగౌడ్, జయంత్‌గౌడ్, వినయ్ గౌడ్, గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నియామకం



కాశిబుగ్గ: తెలంగాణ బీసీ ప్రజా సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఓసిటీకి చెందిన దయ్యాల ప్రభాకర్ నియమితులయ్యారు. ఈమేరకు నియామక పత్రాన్ని హైదరాబాద్‌లో బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నుంచి అందుకున్నారు.

పరామర్శ



మడికొండ: మావోయిస్టు పార్టీ నేత మాచర్ల ఏసోబు కుటుంబ సభ్యులను స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదివారం పరామర్శించారు. ఏసోబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ కల్పనాదేవికి నివాళి



హన్మకొండ చౌరస్తా: మాజీ ఎంపీ టి.కల్పనాదేవి జయంతిని పురస్కరించుకుని హనుమకొండ చౌరస్తా సమీపంలోని జయ ఆస్పత్రిలోని ఆమె విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ కానుగంటి శేఖర్ మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేసిన గొప్ప నాయకురాలు కల్పనాదేవి అని కొనియాడారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో పేదలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శ్రీనివాస్, చీకటి రాజు, నాగసాయిబాబా, రాజేష్, రవి, జగదీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉద్యోగులకు సన్మానం



హన్మకొండ అర్బన్: విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన రెడ్డి సామాజిక వర్గానికి చెందిన పలువురు ఉద్యోగులను రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పలువురు నాయకులు ఆదివారం సన్మానించారు. నగరంలోని పోస్టల్ కాలనీలోని సంఘం కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షుడు అర్జుల కిషన్‌రెడ్డి అధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యుత్ డివిజన్ ఇంజనీర్ సాంబరెడ్డి, వైద్య రంగంలో యూరాలజిస్ట్ మన్నెం శ్రీనాథ్‌రెడ్డి, రా రైస్ మిల్లర్స్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన పాడి గణపతిరెడ్డి, జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న బొమ్మినేని సంధ్యారెడ్డి, ఇటీవల పదోన్నతి పొందిన కామిడి సతీష్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో తెలంగాణ రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి, నాయకులు నల్ల రాజిరెడ్డి, రావుల నరసింహారెడ్డి, చాడా జైహింద్‌రెడ్డి, నిమ్మ సుదర్శన్ రెడ్డి, గోలి బక్కారెడ్డి, ముదిగంటి వెంకట్‌రెడ్డి, రాధారపు సంజీవరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, కేశవరెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

వేయి స్తంభాల దేవాలయంలో ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



పోలీస్ కమిషనరేట్‌లో హారతి ఇస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా



వరంగల్ ఎల్లంబజార్‌లో..



కృష్ణకాలనీలో..



జేపీఎన్ రోడ్డులో..



గుడిబండల్‌లో..



పూజలందుకుంటున్న గణనాథులు

వినాయక చవితి సందర్భంగా నగర వ్యాప్తంగా గణనాథులు ఆదివారం కొలువుదీరారు. అందంగా అలంకరించిన మండపాల్లో గణేశుడి విగ్రహాలను ఉత్సవ కమిటీల నిర్వాహకులు, భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించి పూజలు చేశారు. ఈమేరకు ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను అధికారులు, ప్రజాప్రతినిధులు సందర్శించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

- సాక్షి నెట్‌వర్క్



వరంగల్ డీసీసీబీ కార్యాలయంలో పూజ చేస్తున్న చైర్మన్ మార్నేని రవీందర్ రావు, తదితరులు



బీఆర్ఎస్ హనుమకొండ కార్యాలయంలో పూజ చేస్తున్న వినయ్‌భాస్కర్, రేవతి దంపతులు



వరంగల్ చౌరస్తాలో మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్



ఎర్రగట్టు గుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు



హనుమకొండలోని బన్సాల్ కళాశాలలో..



కాశిబుగ్గలో కొలువుదీరిన వినాయకుడు



కాజీపేటలో మట్టి గణపతికి పూజలు చేస్తున్న జంగా రాఘవ రెడ్డి దంపతులు, తదితరులు



రంగశాయిపేటలో కొలువుదీరిన గణనాథుడిని దర్శించుకుంటున్న భక్తులు



హనుమకొండలో మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న సైకిల్ వాకర్స్ అసోసియేషన్ బాధ్యులు



మెట్టుగుట్టపై విజయ గణేశ్ ఆలయంలో..



31వ డివిజన్‌లో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ మామిండ్ల రాజు

తలసేమియాతో బాధపడుతున్న చిన్నారికి ఆర్థికసాయం



విద్యారణ్యపురి: తలసేమియాతో బాధపడుతున్న హసన్‌పర్తి మండలం కోమటిపెల్లి తండాకు చెందిన బానోతు ప్రేమలత – రాజేష్ దంపతుల కుమార్తె చిన్నారి ప్రతీక్షకు వైద్య ఖర్చుల నిమిత్తం విద్యా ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ రూ.50 వేలు అందజేసింది. ఈమేరకు హనుమకొండలోని వడ్డేపల్లిలోని ఒయాసిస్ అనాథాశ్రమంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో కవి, ఉపాధ్యాయుడు విద్యా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బిల్ల మహేందర్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన చిన్నారి ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో ఫౌండేషన్ ద్వారా చేయూతనందించినట్లు వివరించారు. కార్యక్రమంలో విద్యా ఫౌండేసన్ సభ్యులు, దాతలు అప్పాల శకుంతల, గజ్జెల స్వరూపారాణి, రమ్మోజుల సురేఖ, మద్దెర్ల అనిత, కాంచనపెల్లి అనిత, వాణిరాణి, మహ్మద్, రవి, కార్తీకరాజు, కృష్ణ, కడుదల సోమన్న, చంద్రశేఖర్, విద్యాసాగర్, వెంకట్రాజు, ఇద్దిరాజు ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల అందజేత



రామన్నపేట: నగరంలోని రామన్నపేట గోసిగొల్లవాడలో నివాసముంటున్న గద్వాల సరోజన ఇల్లు ఆదివారం తెల్లవారుజామున కుప్పకూలింది. దాంతో నిరాశ్రయులుగా మారిన బాధితురాలికి డాక్టర్ ఎ.రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రాజేంద్రప్రసాద్ ట్రస్ట్ తరఫున బాధిత వృద్ధురాలికి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ కేవలం మానవతా దృక్పథంతోనే సహకారం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఆర్గనైజర్ శ్రవణ్, సామ్రాట్, మల్లయ్య, ఎల్లమ్మ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

జాతి హక్కుల సాధనకు పోరాడుదాం

హన్మకొండ చౌరస్తా: కాసాని జ్ఞానేశ్వర్ మార్గదర్శకత్వంలో జాతి హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడుదామని ముదిరాజ్ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి కాసాని వీరేష్ పిలుపునిచ్చారు. హనుమకొండ రెడ్డికాలనీలోని శారదా గార్డెన్‌లో ముదిరాజ్ మహాసభ ఉమ్మడి వరంగల్ జిల్లా ముఖ్య నాయకుల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వీరేష్ మాట్లాడుతూ ముదిరాజ్‌లను బీసీ 'డీ' నుంచి ఏ లోకి మార్చే వరకూ అవిశ్రాంత పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ముదిరాజ్‌లకు రూ.వెయ్యి కోట్లతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, 75శాతం రాయితీపై రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ పేర్కొన్నట్లుగా బీసీ 'ఏ' లోకి మార్చకపోతే హైదరాబాద్‌లో ముదిరాజ్ ప్రభంజనం సృష్టిస్తామని కాసాని వీరేష్ హెచ్చరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల జగదీష్‌ప్రసాద్, మహాసభ వివిధ జిల్లాల బాధ్యులు వన్నాల కృపాసాగర్, సుభాష్, వెంకన్న, లక్ష్మీనర్సయ్య, కుమారస్వామి, వెంకన్న, శ్రీకాంత్, రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాసాని వీరేష్

సంఘాలు వేరైనా జాతి ఐక్యతకు పనిచేద్దాం

హన్మకొండ: సంఘాలు వేరైనా జాతి ఐక్యత కోసం పనిచేద్దామని ముదిరాజ్ ఎంప్లాయిస్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ – తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్ అన్నారు. హనుమకొండలో జరిగిన సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన కాసాని వీరేష్‌ను దేవేందర్ మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. రాష్ట్రంలో అనేక ముదిరాజ్ సంఘాలు ఉన్నాయని, అవన్నీ ఒక్కతాటిపైకి వచ్చినప్పుడే ముదిరాజుల సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. వెంకన్న, నీరటి రాజు, దండు చిరంజీవి, సింగారపు రామకృష్ణ, అమ్మగారి శ్యామ్, వీరబోయిన వినోద్, శ్రీధర్, సాహిత్ పాల్గొన్నారు.

రేపు చాకలి ఐలమ్మ విగ్రహం ఆవిష్కరణ



సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్

హన్మకొండ: హనుమకొండ భద్రకాళి చెరువు మత్తడి ప్రాంతంలో ఏర్పాటు చేసిన వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఈనెల 10న ఉదయం ఆవిష్కరించనున్నట్లు చాకలి ఐలమ్మ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రావుల సుదర్శన్ తెలిపారు. హనుమకొండలోని సంఘం జిల్లా కార్యాలయంలో సంఘం జిల్లా కమిటీ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాకలి ఐలమ్మ పోరాటం భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయమని కొనియాడారు. ఈ క్రమంలోనే ఉమ్మడి వరంగల్ జిల్లాకు కేంద్రమైన హనుమకొండలోని భద్రకాళి మత్తడి ప్రాంతంలో ఏర్పాటు చేసిన విగ్రహ ఆవిష్కరణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. చాకలి ఐలమ్మ సంక్షేమ సంఘం గౌరవ సలహాదారులు నాగపురి నందయ్య, రావుల శ్రీహరి, ఉపాధ్యక్షుడు నాగపురి సదానందం, ప్రధాన కార్యదర్శి నాగపురి సంతోష్, సహాయ కార్యదర్శులు ఎదులాపురం శ్రీనివాస్, రావుల రాజేష్, కోశాధికారులు రావుల రాజు, కిషోర్ పాల్గొన్నారు.

'మిలాద్ ఉన్ నబీ' వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మర్కజీ మిలాద్ కమిటీ బాధ్యులు

హన్మకొండ చౌరస్తా: మహ్మద్ ప్రవక్త పుట్టిన రోజును పురస్కరించుకుని ఈనెల 15వ తేదీన హనుమకొండ రాయపురలోని జక్రియా ఫంక్షన్ హాల్‌లో 'మిలాద్ ఉన్ నబీ' వేడుకలను నిర్వహించనున్నట్లు మర్కజీ మిలాద్ కమిటీ అధ్యక్షుడు ఖాజా సిరాజుద్దీన్ అన్నారు. మర్కజీ మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో హనుమకొండలోని బర్కతియా మదర్సాలో వేడుకల వాల్‌పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిరాజుద్దీన్ మాట్లాడుతూ ప్రపంచశాంతికి ఇస్లాం బోధనలు ఉపకరిస్తాయని, ప్రవక్త బోధనలు సర్వమానవాళికి అనుసరణీయం, ఆచరణీయమని అన్నారు. 15వ తేదీన రాత్రి 8నుంచి ఉదయం 5గంటల వరకు జరగనున్న వేడుకలకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఇస్లాం పండితులు పాల్గొంటారని తెలిపారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. 16వ తేదీన ఉదయం ప్రభుత్వ ఆస్పత్రులలో రోగులకు పండ్లు పంపిణీ కార్యక్రమం ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో కమిటీ బాధ్యులు నయీం, అఫ్జల్ బర్కతి, షఫీ, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహం ఏర్పాటుకు చర్యలు

ఖిలా వరంగల్: వరంగల్ 39వ డివిజన్ ఏకశిలనగర్‌లోని ముఖ్యకూడలిలో 30ఏళ్ల క్రితం గద్దెపై ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ విగ్రహాన్ని తొలగించారు. ఆ స్థానంలో నిలువెత్తు మహాత్మాగాంధీ మరో విగ్రహం ఏర్పాటుకు బొడ్రాయి ప్రతిష్ఠాపన కమిటీ చర్యలు తీసుకుంది. రూ.45 వేలు ఖర్చు చేసి ఇప్పటికే విగ్రహాన్ని తెప్పించారు. త్వరలోనే బొడ్రాయి ప్రతిష్ఠాపన పూజలతో పాటు మహాత్మా గాంధీ విగ్రహం ఏర్పాటుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు బొరిగం నర్సింగం తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే స్టేషన్‌లో ఫిట్స్‌తో బాధపడుతూ కిందపడిన గుర్తు తెలియని వ్యక్తిని కాజీపేట జీఆర్పీ పోలీసులు చికిత్స కోసం 108 అంబులెన్స్‌లో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఈనెల 5వ తేదీన తెల్లవారుజామున గుర్తు తెలియని సుమారు 30ఏళ్ల వయస్సు గల వ్యక్తి ఫిట్స్‌తో బాధపడుతున్నట్లు గుర్తించి చికిత్స కోసం ఎంజీఎం ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలించినట్లు పోలీసులు తెలిపారు. చికిత్స పొందుతున్న వ్యక్తి శనివారం మృతి చెందినట్లు వివరించారు. మృతదేహాన్ని ఎంజీఎం ఆస్పత్రి మార్చురీలో భద్రపరచి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు కాజీపేట జీఆర్పీ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని వారు సూచించారు.

అనారోగ్యంతో యోగా గురువు మృతి



అశోక్ (ఫైల్)

కాజీపేట: యోగా గురువు కోడం అశోక్ (55) అనారోగ్య సమస్యలతో ఎంజీఎం ఆస్పత్రిలో వారం రోజులుగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. దర్గా కాజీపేటకు చెందిన అశోక్ గురూజీ మూడు దశాబ్దాలుగా పతంజలి యోగా ప్రకృతి చికిత్సాలయంలో నగరంలోని వేలాది మందికి యోగా శిక్షణ ఇచ్చారు. 1993లో గీతం యూనివర్సిటీలో సివిల్ ఇంజనీరింగ్‌లో పట్టభద్రుడైన అశోక్‌కు అనేక ఉన్నత ఉద్యోగ అవకాశాలు వచ్చినా ప్రముఖ యోగా గురువు రాందేవ్‌బాబాతో ఏర్పడిన పరిచయంతో యోగా వైపు మళ్లారు.

కారు ఢీ.. పారిశుద్ధ్య కార్మికురాలికి గాయాలు

వరంగల్ అర్బన్: విధుల్లో ఉన్న బల్దియా పారిశుద్ధ్య కార్మికురాలిని ఆదివారం తెల్లవారుజామున ఓ కారు ఢీ కొట్టింది. దీంతో ఆమె రెండు కాళ్లకు బలమైన గాయాలయ్యాయి. హనుమకొండ లోకల్ బస్సు డిపో సమీపంలో రామంచ సమ్మక్క రోడ్డు ఊడ్చుతుండగా అంబేడ్కర్ విగ్రహం వైపు వెళ్లే కారు ఆమెను ఢీకొట్టింది. సీఐటీయూ, మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ఘటన స్థలాన్ని సందర్శించి, ఎంజీఎంలో చికిత్స పొందుతున్న సమ్మక్కను పరామర్శించారు.

విద్యుదాఘాతంతో పాడి గేదెల మృతి



వరంగల్: 3వ డివిజన్ పరిధిలోని ఆరెపల్లి సమీపంలోని కొత్తపేట శివారులో విద్యుదాఘాతంతో రెండు పాడి గేదెలు ఆదివారం మృతి చెందినట్లు బాధితుడు కన్నబోయిన రాజయ్య తెలిపారు. విద్యుత్ తీగలు కిందికి వేలాడుతుండడంతో మేతకు వెళ్లిన పాడిగేదెలు ప్రమాదానికి గురై మృతిచెందినట్లు వాపోయారు. హర్యానా నుంచి వాటిని సుమారు రూ.2.60 లక్షలు వెచ్చించి తెప్పించినట్లు తెలిపారు. వాటి మృతితో జీవనోపాధి పోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.

చాపర్తి కుమార్ నిరవధిక దీక్షను విరమింపజేయాలి

హన్మకొండ: బీసీ జనగణన చేయాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలనే డిమాండ్‌తో రజక రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు చాపర్తి కుమార్ గాడ్గె చేస్తున్న నిరవధిక నిరాహార దీక్షను విరమింపజేసేందుకు బీసీ మంత్రులు, ఎమ్మెల్యేలు చొరవ తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు పిడిశెట్టి రాజు కోరారు. కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాలని 14 రోజులుగా నిరవధిక నిరాహార దీక్ష చేస్తుండడంతో అతని ఆరోగ్యం క్షీణించిందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తొలుత హైదరాబాద్‌లో దీక్ష ప్రారంభించగా అక్కడ భగ్నం చేసి గీసుకొండలోని అతని స్వగృహంలో పోలీసులు వదిలిపెట్టారని, స్వగృహంలో దీక్ష చేస్తుండగా ఎంజీఎంకు తరలించి అక్కడి నుంచి వదిలిపెట్టగా తిరిగి బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద దీక్ష చేపట్టగా భగ్నం చేశారని వివరించారు. గీసుకొండలోని తన ఇంటి వద్ద కుమార్ నిరవధిక నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు.

విద్యాకమిషన్ ఏర్పాటు హర్షణీయం



మాట్లాడుతున్న అజయ్‌కుమార్

విద్యారణ్యపురి: తెలంగాణ రాష్ట్రంలో విద్యా కమిషన్ ఏర్పాటు హర్షణీయమని తెలంగాణ గురుకులాల ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ (టీజీపీఏ) అధ్యక్షుడు డాక్టర్ ఆర్.అజయ్‌కుమార్ అన్నారు. హనుమకొండలో ఆదివారం నిర్వహించిన టీజీపీఏ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాథమిక విద్యనుంచి విశ్వవిద్యాలయాల ఉన్నత విద్యవరకు అనేక సంస్కరణలు చేపట్టేందుకు ఐఏఎస్ రిటైర్డ్ అధికారి ఆకునూరి మురళిని విద్యా కమిషన్ చైర్మన్‌గా నియమించడం గొప్ప పరిణామమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని గురుకులాల బలోపేతానికి మరింతగా సమర్థవంతంగా ప్రిన్సిపాళ్లు పనిచేయాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. టీజీపీఏ ఆర్గనైజింగ్ సెక్రటరీ భిక్షపతి మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా విద్యార్థులకు ప్రభుత్వం మెస్‌చార్జీలు పెంచాలని సూచించారు. గురుకుల ప్రిన్సిపాళ్లు, బోధన సిబ్బందికి హెల్త్‌కార్డులు ఇవ్వాలని కోరారు. సమావేశంలో టీజీపీఏ రాష్ట్ర మహిళా కార్యదర్శిటి నీలిమరెడ్డి, ఉపాధ్యక్షురాలు నిరంజన్ రెడ్డి, అధికార ప్రతినిధి శ్రీనివాస్, వివిధ సొసైటీల బాధ్యులు రవీందర్, విజయజ్యోతి, శ్రీనివాస్‌రావు, శైలజరాణి, వీ.రాజు తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీలు రాజకీయ రంగంలో రాణించాలి



ఉత్తర్వులు అందుకుంటున్న కార్యవర్గ సభ్యులు

వరంగల్: పద్మశాలీ కులస్తులు అన్ని రంగాల్లో ఎదుగుతున్నారని, అదేవిధంగా రాజకీయంగా రాణించేందుకు కూడా కృషి చేయాలని 20వ డివిజన్ కార్పొరేటర్, సంఘం గౌరవ అధ్యక్షుడు గుండేటి నరేంద్రకుమార్ పిలుపునిచ్చారు. కాశీబుగ్గ కేవీఎస్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన పద్మానగర్ పద్మశాలి పరపతి సంఘం 23వ వార్షిక సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మామిడి ఈశ్వరయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కుసుమ సారంగపాణి, కార్యదర్శిగా దూడం అనిల్ కుమార్, కోశాధికారిగా గడ్డం రమేష్ భరద్వాజ్, సహ కోశాధికారిగా వడ్డెపల్లి శ్రీనివాస్‌తో పటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

గణేష్ స్మారకార్థం అన్నదానం



అన్నదానం చేస్తున్న గణేష్ కుటుంబ సభ్యులు

హన్మకొండ: సిద్దం గణేష్ జయంతిని పురస్కరించుకుని అతడి కుటుంబ సభ్యులు, డాల్ఫిన్ రెస్టారెంట్, బేకరీ నిర్వాహకులు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. హనుమకొండ సుబేదారిలోని సిద్దం విజయరాజ డాల్ఫిన్ ఫ్రెడ్ కాంప్లెక్స్ వద్ద గణేష్ చిత్రపటానికి కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో రాజయ్య, విజయ, సాయి సూర్యవంశీ, తేజస్విని, సునయన, శ్రీధర్, శ్వేత, మురళి, రూపారాణి, కిరణ్, పద్మ, సహజ్, స్వరళి, స్ఫూర్తి, సిరి, శ్రేష్ఠ, సాయి, సోహన్, తదితరులు పాల్గొన్నారు.

హసన్‌పర్తి - కేశవాపూర్ రోడ్డు అధ్వానం



గుంతల్లో నిలిచిన వరదనీరు

హసన్‌పర్తి: హసన్‌పర్తి – కేశవాపూర్ ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. ముఖ్యంగా ఇందిరమ్మ కాలనీ సమీపంలో రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. నల్లగట్టు గుట్ట నుంచి సుభాష్ చంద్రబోస్ విగ్రహం వరకు రోడ్డు నిర్మాణం కోసం రెండేళ్ల క్రితం నిధులు విడుదలయ్యాయి. సదరు కాంట్రాక్టర్ సగం వరకు మాత్రమే పనులు చేపట్టి వదిలేశాడు. ఈ రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో వాహన దారులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా గుంతల్లో వరద నీరు చేరడంతో రోడ్డు ప్రమాదకరంగా మారింది.